క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు



నెల్లూరు(వేదాయపాళెం): గిరిజన నేత కుంభా రవిబాబును ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేయడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ చైర్మన్ పోలయ్య కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ మేరకు బోసుబొమ్మ సెంటర్‌లోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అనంతరం సీఎంకు కృతజ్ఞతగా నినాదాలు చేశారు. నేతలు సురేష్, రమేష్, వంశీ, పోతురాజు పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు పురస్కారాలు



బొత్స సత్యనారాయణ ద్వారా పురస్కారాన్ని అందుకుంటున్న వెంకటప్పయ్య

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన కవులు, రచయితలు పెరుగు రామకృష్ణ, వెంకటప్పయ్యను మాతృభాష సేవా శిరోమణి పురస్కారాలతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం సత్కరించారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘ ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో తమకు పురస్కారాలను అందజేశారని వారు చెప్పారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి సత్కారం



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్‌ను యానాదుల సంక్షేమ సంఘ నేతలు మంగళవారం సత్కరించారు. గిరిజన కులాల సమస్యలు, ఆధార్ కార్డులు, భూ సమస్యలు, ఉపాధి అవకాశాలు, తదితరాలపై ఆయనతో చర్చించారు. యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసరావు, మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు సతీష్‌చంద్ర, జిల్లా మహిళాధ్యక్షురాలు ఉషా, తదితరులు పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై దాడులు



నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): పేకాట కేంద్రంపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి 15 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. నవాబుపేట పరిధిలోని రాజీవ్‌గాంధీకాలనీ పెన్నా సమీపంలో పేకాటాడుతున్నారనే పక్కా సమాచారం జిల్లా ఎస్‌ఈబీ అధికారి శ్రీలక్ష్మికి మంగళవారం రాత్రి అందింది. ఆమె ఆదేశాల మేరకు డీఎస్‌ఈఓ కార్యాలయ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఈబీ నెల్లూరు - 1 ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్‌బాషా, కిశోర్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాటాడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.78,570 నగదు, ఆరు బైక్‌లు, 17 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఎస్‌ఈబీ నెల్లూరు - 1 స్టేషన్‌కు తరలించి జూదరుల వివరాలను సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెరిగిన బ్రహ్మోత్సవ రాబడి



కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకేశ్వరస్వామి బ్రహ్మోత్సవ రాబడి స్వల్పంగా పెరిగింది. గతేడాదితో పోల్చుకుంటే రూ.50 వేలు అధికంగా వచ్చింది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.14,15,286లు రాగా, గతేడాది రూ.13,65,250లు వచ్చింది. ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. స్వామివారి దర్శిన టిక్కెట్ల ద్వారా రూ.3,26,505లు, హుండీ ద్వారా రూ.2,13,869లు, వేలం ద్వారా రూ.8,60,150లు, కల్యాణం చదివింపులు రూ.5,912ల వంతున రాబడి వచ్చిందని ఈఓ బి.శాంతయ్య తెలిపారు. దేవదాయశాఖ ఈఓ చిట్టిబాబు, ఆలయ ట్రస్టీలు శేషరెడ్డి, ఎ.వెంకటరమణమ్మ, ఆలయ అర్చకులు డి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 39, 40వ డివిజన్లకు సంబంధించిన కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశాన్ని మూలాపేటలోని చాముండివారి తోట పార్కులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక డివిజన్లలో పర్యటించిన సమయంలో ప్రజలు తెలిపిన పనులను ఎన్నికల కోడ్ తొలగిపోయిన వెంటనే ప్రారంభిస్తామని చెప్పారు. రోడ్లు, డ్రెయిన్లు, తదితర పనులను జూలై నెలాఖరులోపు పూర్తి చేస్తామని వివరించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు



నెల్లూరు సిటీ: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని ప్రత్యామ్నాయాలను సిద్ధం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ కేంద్ర ఏర్పాటును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించి నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ఆర్థిక సంఘ, సాధారణ నిధులతో అభివృద్ధి పనులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, మనబడి నాడు - నేడు, తదితరాలపై చర్చించారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, చంద్రయ్య, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతన దరఖాస్తులకు మరో అవకాశమివ్వాలని వినతి



ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వం అందజేస్తున్న గౌరవ వేతనం కోసం దరఖాస్తు చేసుకోని జిల్లాలోని పాస్టర్లకు మరో అవకాశం కల్పించాలని.. చర్చి నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు హనోక్, ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని నగరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అనంతరం ఎంపీని సత్కరించారు. అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, కోశాధికారి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యుడు వినోష్, నెల్లూరు యూత్ క్రిస్టియన్ సభ్యులు రాజేష్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డులో ఇంటింటి చెత్త సేకరణ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి రీసైక్లింగ్ విధానానికి సహకరించాలని కోరారు. కాలువల్లో పూడికతీత పనులు, దోమల నివారణ చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్‌ను ప్రతి డివిజన్లో క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు.

పన్నులను వసూలు చేయాలి

ఆస్తి, కుళాయి పన్నుల లక్ష్యాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణ యూజర్ చార్జీల బకాయిలను వసూలు చేయాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

నకిలీ షూ విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): ఓ ప్రముఖ కంపెనీ బ్రాండ్ పేరిట నకిలీ షూలు, చెప్పుల విక్రయాలపై కంపెనీ ప్రతినిధులు స్థానిక పోలీసులతో కలిసి దాడులు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన నిఖిల్ దినకర్ పాటిల్ ప్యారగాన్ కంపెనీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. కంపెనీ పేరిట నకిలీ షూలు, చెప్పుల విక్రయాలపై నవాబుపేట పోలీసులతో కలిసి దాడులు చేశారు. వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ వద్ద నకిలీ షూలను విక్రయిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ రషీద్‌ను అదుపులోకి తీసుకొని షూలను స్వాధీనం చేసుకున్నారు. నిఖిల్ దినకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేశవులునగర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలోని కేశవులునగర్ రెండో వీధిలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కృష్ణసింగ్ కుటుంబం నివాసం ఉంటోంది. నాయుడుపేటలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుమారుడి వద్దకు కృష్ణసింగ్ తన భార్య, కుమార్తెతో కలిసి ఈ నెల 11న వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి గ్రిల్స్ తాళాలు, గదుల తలుపులను పగలగొట్టారు. రెండు బీరువాలను పగలగొట్టి అందులో ఉన్న సుమారు కిలో వెండి ఆభరణాలు, రూ.ఐదు వేలను అపహరించుకెళ్లారు. ఊరి నుంచి తిరిగొచ్చిన కృష్ణసింగ్ చోరీ ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తపై మేనల్లుడి దాడి

నెల్లూరు(క్రైమ్): అత్తపై మేనల్లుడు దాడి చేసిన ఘటన కపాడిపాళెంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కపాడిపాళెంలోని ఓ ఇంటి కింది భాగంలో ఉషా, పైభాగంలో ఆమె సోదరులు బాబు, రవి నివాసం ఉంటున్నారు. బాబు చనిపోయిన నాటి నుంచి అతని భార్య, కుమారులు, చిన్న అన్న భార్య ఆమెను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇబ్బందులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న ఇంటి ముందు ఆమె పని చేసుకుంటుండగా అన్న కుమారుడు అఖిల్ దాడి చేశారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

చంపుతామని బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి అక్కడున్న దిమ్మెలను కూల్చేయడమే కాకుండా ప్రశ్నించిన వ్యక్తిని చంపుతామని బెదిరించిన ఘటనలో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌లోని గౌడ హాస్టల్ సమీపంలో నివాసం ఉంటున్న సుధాకర్‌రెడ్డి దంపతులకు కొండాయపాళెంలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ప్లాట్లు ఉన్నాయి.

ఇటీవల వారు సదరు ప్లాట్లను శుభ్రం చేసి దిమ్మెలు కట్టారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన కృష్ణారెడ్డి వారికి ఫోన్ చేసి ప్లాట్లను వదిలివెళ్లాలని లేకపోతే చంపుతామని బెదిరించడమే కాకుండా అక్కడి దిమ్మెలను పగలగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి బాలిక అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బీవీనగర్‌లో సురేంద్రకుమార్ తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పెద్ద కుమార్తె సోమవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): పార్శిల్ ఆఫీస్ ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నారాయణరెడ్డిపేటకు చెందిన నాగరాజు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లోని పార్శిల్ కార్యాలయంలో మర్చంట్‌గా పనిచేస్తున్నారు. గత నెల 24న తన బైక్‌ను పార్శిల్ కార్యాలయం వద్ద పార్క్ చేసి పనికెళ్లారు. తిరిగొచ్చి చూడగా బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా పోలీస్ సంక్షేమ సంఘ అడ్‌హాక్ కమిటీ నియామకం

నెల్లూరు(క్రైమ్): ఏపీ విలేజ్ అండ్ వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అడ్‌హాక్ కమిటీని నియమించారు. ప్రెసిడెంట్‌గా విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీగా దేవసేన, అడిషనల్ జనరల్ సెక్రటరీగా సుహాసిని, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా మాధవి, వైస్ ప్రెసిడెంట్లుగా మమత, సబీహాబేగం, అబీదా, వర్కింగ్ ప్రెసిడెంట్లు గా సుజన జయప్రదీప్, వెంకటకుమారి, ట్రెజరర్‌గా షకీనా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మౌనిక, హేమసాయిలక్ష్మి, తదితరులను నియమించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డిని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. నగరంలోని ఆదాల నివాసంలో కలిసిన మురళీధర్ వీరిని సత్కరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు చిన్నారి ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు చిన్నారి ఎంపికైంది. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోవూరులో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ - 7, 9 చెస్ పోటీల్లో సహస్ర ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

కేటీఎస్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సహస్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అకాడమీ డైరెక్టర్ దుర్గాభవానీ, కోచ్ కిషోర్, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



నెల్లూరు (టౌన్): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషపై వక్తృత్వ పోటీలను కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్‌రావు, సంధ్యారాణి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర పెంచాలి

నెల్లూరు(అర్బన్): ధాన్యానికి ఇస్తున్న మద్దతు ధరను పెంచాలని ఏపీ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు సంఘ నేతలతో కలిసి కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రాన్ని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు.

చీటింగ్ కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీని మోసగించారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో పొదలకూరు మండలం నావూరుపల్లికి చెందిన రవీంద్రకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.పది వేల జరిమానాను విధిస్తూ నెల్లూరు ఐదో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దేవిక మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కరెంటాఫీస్ సెంటర్ సమీపంలోని టీవీఎస్ క్రెడిట్ సర్వీసెస్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్‌గా పొదలకూరులోని రామాలయం వీధికి చెందిన పృథ్వీరాజ్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో నావూరుపల్లికి చెందిన రవీంద్ర మార్చి 15, 2016న కంపెనీకి వచ్చి డస్టర్ కారుకు లోన్ కావాలని కోరి, దానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. సదరు కంపెనీ మార్చి 19న రూ.4.9 లక్షలను కంపెనీ ఎగ్జిక్యూటివ్ పృథ్వీరాజ్‌కు ఇచ్చి కారుకు సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకోవాలని సూచించింది. అయితే ఈ నగదును రవీంద్ర, పృథ్వీరాజ్ వాడుకున్నారు. మూడు వాయిదాలకు గానూ రూ.42,171 చెల్లించి మిగిలిన నగదును చెల్లించకపోవడంతో కంపెనీకి అనుమానం వచ్చి విచారణ జరపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కంపెనీ మేనేజర్ అదే సంవత్సరం ఆగస్ట్ ఏడున వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విచారణలో రవీంద్రపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలుతో పాటు రూ.10 వేల జరిమానాను విధించారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ పృథ్వీరాజ్‌పై నేరం రుజువు కాకపోవడంతో ఆయనపై కేసును కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ప్రకృతి కుమార్ కేసు వాదించారు.

పులి వాహనంపై మూలస్థానేశ్వరుడు



నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి పులి వాహనంపై మంగళవారం దర్శనమిచ్చారు. చప్పరోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. చప్పరోత్సవానికి ఉభయకర్తలుగా రాజశేఖర్, ఉమా దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలకలతోపు ఉత్సవాన్ని బుధవారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు.



జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన G.S రమణశేఖర్, తండ్రి. G.V.శివగోపాల్, [illegible], నెల్లూరు సిటీ అనువారు ఇచ్చిన అనుమతి మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా :- నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని విజయరంగన్ మణికంఠన్, తండ్రి. విజయరంగన్, [illegible], చెన్నై-2 అనువారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిశ్చయించుకొనినారు. సదరు విజయరంగన్ మణికంఠన్ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని [illegible] రమేష్ బాబు, తండ్రి. [illegible] అను వారి వద్ద నుండి రిజిస్టర్డు విక్రయపత్రం తేది. 12.09.2011 డాక్యుమెంటు నెం.11764/2011 ద్వారా కొనుగోలు చేసినారని, సదరు [illegible] రమేష్‌బాబు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని నెలవాయి సుధాకర్ తండ్రి. రాఘవరెడ్డి అనువారి వద్ద నుండి రిజిస్టర్డు విక్రయపత్రం తేది. 16.12.2002 డాక్యుమెంట్ నెం.9591/2002 ద్వారా కొనుగోలు చేసినారని, సదరు సుధాకర్ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని [illegible] మునెమ్మ, భర్త. [illegible] గారి వల్ల జనరల్ పవర్ పొందిన ఏజెంటు [illegible], తండ్రి. [illegible] గారి వద్ద నుండి రిజిస్టర్డు విక్రయ పత్రం తేది.19.12.1988 డాక్యుమెంటు నెం.7532/1988 ద్వారా కొనుగోలు చేసినారని మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, అడమానములు, అగ్రిమెంట్లు, అప్పులు, [illegible], కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికైనా ఎటువంటి అక్షేపణలు ఉన్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా తగిన ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు అక్షేపణలు నా క్లయింట్ అంగీకరించరు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, నెల్లూరు సబ్ - రిజిస్ట్రారులో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన, [illegible] గ్రామం, సర్వే నెం.58రు భూమి లే - అవుట్ చేయబడి కొండాయపాళెం పంచాయితి వారి వల్ల తే.05.04.70దిన పి.ఆర్.నెం.4రుగా అప్రూవ్ కాబడిన ప్లాను దాఖలా "జయనగర్" కాలని అను ఏరియాలోని "ఎ" బ్లాక్‌లోని నెం.585రు ప్లాటు 33 1/3 అంకణములు లేక 222.969 చదరపు మీటర్లు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: ప్లాటు నెం.587రు, దక్షిణం : లే - అవుట్ రోడ్డు, పడమర: లే - అవుట్ రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెం.584 రు. యీ హద్దులలోని 33 1/3 అంకణములు ఖాళీ స్థలము.

పెనుబాక గంగాధర రెడ్డి, B.Com.,B.L.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3, సెల్: 98493 49333



